


మోహన - రూపకం

దాచుకో నీ పాదాలకు - దగ నేజేసిన పూజలివి
పూచి నీకీరితి రూపు - పుష్పములివియయ్యా

ఒక్క సంకీర్తనే చాలు - వొద్దికై మమ్ము రక్షింపంగ
తక్కినవి భాండారాన - దాచివుండ నీ
వెక్క సమగు నీ నామము - వెలసులభము ఫలమధికము
దిక్కై నన్నేలితి వి - తీరని నాధనమయ్యా

నా నాలికపైనుండి - నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను - బొగడించితివి
వేనామాల వెన్నుడా - వినుతించనెంతవాడ
కానిమ్మని నాకీ పుణ్యము - గట్టితివింతేనయ్యా

ఈ మాట గర్వము కాదు - నీ మహిమేకొనియాడితిగాని
చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నే మాన బాడేవాడను - నేరము లెంచకుమీ
శ్రీమాధవ నేనీదాసుడ - శ్రీవేంకటేశ్వరుడవయ్యా

www.greenmangos.net

'శ్రీరామ రామరామేతి రమేరామే మనోరమే
సహస్రనామతస్తుల్యం రామనామవరాననే
శ్రీరామనామవరానన ఓం నమ ఇతి' అని పరమేశ్వరుడు

పార్వతీదేవికి చెప్పినట్లు విష్ణుసహస్రనామస్తోత్రంలో ఉత్తరపీఠికలో పేర్కొనబడింది. శ్రీవిష్ణుని వేయినామాలకు మించుమలె ఒక్క శ్రీరామ నామం చాలునట. కలిలో ఇతర పూజావిధులు అనవసరం. సంకీర్తనమొక్కటే చాలు. 'వేనామాల వెన్నుడా' అని సంబోధ న. వేయి పేరులున్న నీకు నేను 32వేల సంకీర్తనలు నివేదించాను. అది నా ప్రజ్ఞేమీకాదు. నా రసనాసనంపై నీవుండి వీటిని పలికింప జేశావు. నేనెంతవాడినయ్యా నిన్ను పొగడగ లందుకు. పోనీలే గదా అని ఈ పుణ్యం నాకు కట్టి పుణ్యం కట్టుకున్నావు. కానీ నీవే భోక్త వు. నీవే భోజ్యానివి.

ఈ సంకీర్తనలు నీకై పూచిన, నీవు పూయించుకొన్న నానా జాతుల, నానారీతుల జాతి పువ్వులు. సుస్వరవర్ణ మంత్రపుష్పాలు. ఇవి నా సంపద ఇవి నా సర్వస్వం. నీ శ్రీపదాలకు నేను జేసిన పదపూజలు. వీటిని జాగ్రత్తగా పదిలపరచు. ఒక్క సంకీర్తన చాలు నా జన్మ తరించడానికి. తక్కినవి అన్నీ నీ శ్రీభాండారంలో దాచుకో. రసజగత్కల్యా ణానికి ఇవి మూలధనం.

"ఈ మాట నేను గర్వించి పలకటం లేదు. నీ మహిమే ఉగ్గడించానుకానీ, నా అంతట స్వతంత్రంగా నేను ఉద్వచించినదికాదు. నీ సంకీర్తనాగానం చేసే వాడివి. నా పూర్వపాపాదులు ఇప్పుడెందుకు. నీ దాసుడిని నేను. అయ్యా నీవు శ్రీవేంకటేశుడివి. సర్వ దోష నివారక నామధేయుడవు: గ్రహించు" అని. ఆంధ్రవేదాభివక్త, పదకవితాపితామహు లు అన్నమాచార్యులు తన సంకీర్తనా సామ్రాజ్యం సర్వస్వం శ్రీవేంకటేశ్వర శ్రీపదార్చనగా కైంకర్య మొనరించి, ధన్యుడై, తన కవితను విన్నవారినీ, తన పదములు పాడగన్నవారినీ ధన్యత నొందిస్తున్నారు.

www.greenmangos.net